క్లుప్తంగా

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



నడికూడ : రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు అయ్యాయి. ఈ సంఘటన మండలంలోని ధర్మారం గ్రామ శివారు పరకాల –అంబాల ప్రధాన రహదారిపై బుధవారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. వరంగల్‌కు చెందిన బొల్లం రాజు–సరిత దంపతులు బైక్‌పై పరకాలకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ధర్మారం గ్రామశివారులోని తాటివనం వద్దకు చేరుకోగానే భూపాల్‌పల్లి నుంచి వరంగల్‌కు వస్తున్న కారు అదుపుతప్పి ఎదురుగా వస్తున్న రాజు బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో బైక్‌పై ఉన్న దంపతులకు తీవ్ర గాయాలు అయ్యాయి. స్థానికులు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పేకాటరాయుళ్ల అరెస్టు



ఐనవోలు : మండలంలోని ఉడుతగూడెం శివారులో పేకాడుతున్న ఏడుగురిని అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనిల్‌కుమార్ బుధవారం తెలిపారు. తమకు వచ్చిన పక్కా సమాచారంతో పేకాట స్థవరంపై ఆకస్మిక దాడులు నిర్వహించి ఏడుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నట్లు పేర్కొన్నారు. వారి నుంచి రూ.10,240 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, 52 పేక ముక్కలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

ఆత్మకూరు : మండలంలోని అక్కంపేటలో ఇటీవల మృతి చెందిన ఇమ్మడి తరుణ్ కుటుంబాన్ని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు అల్లం బాలకిశోర్‌రెడ్డి బుధవారం పరామర్శించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. అల్లం మర్రెడ్డి, మాజీ వైస్‌ఎంపీపీ ముద్దం సాంబయ్య, శ్రీకాంత్, ముద్దం కృష్ణ, మాదాసి శ్రీధర్, రాంబాబు పాల్గొన్నారు.

సైన్స్‌ఫెయిర్‌లో శ్రీవాణికి ప్రథమ బహుమతి



శాయంపేట : మండలంలోని ఆరెపల్లి గ్రామానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయురాలు శ్రీవాణికి ప్రథమ బహుమతి లభించింది. బుధవారం జిల్లా స్థాయిలో ఆన్‌లైన్‌లో జరిగిన సైన్స్‌ఫెయిర్ ఉపాధ్యాయుల కేటగిరిలో జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతి లభించింది. ఈ సందర్భంగా జిల్లా విద్యాశాఖ అధికారిణి వాసంతి, జిల్లా సైన్స్‌అధికారి శ్రీనివాస్ చేతుల మీదుగా బహుమతి అందుకున్నారు.

గుడుంబా పట్టివేత



ఆత్మకూరు : మండలంలోని పెద్దాపూర్‌లో గుడుంబా విక్రయిస్తున్నారనే సమాచారంతో పోలీసులు బుధవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో వేల్పుల గణేష్ తన ఇంటి వద్ద నిల్వ ఉంచిన 56 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నట్లు సీఐ సంతోష్ తెలిపారు. గణేష్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు పంపినట్లు పేర్కొన్నారు.

మున్సిపల్ కమిషనర్ బదిలీ

పరకాల : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో రాష్ట్రంలో జరిగిన 40 మంది మున్సిపల్ కమిషనర్ల బదిలీల్లో భాగంగా పరకాల మున్సిపల్ కమిషనర్ టి.శేషాంజన్‌స్వామి బదిలీ అయ్యారు. కొత్తగూడెం మున్సిపల్ కమిషనర్‌గా ఆయన బదిలీపై వెళ్లగా ఆయన స్థానంలో గద్వాల జిల్లా మున్సిపల్ కమిషనర్ కె.నర్సింహను నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

మద్యం స్వాధీనం

వరంగల్: ఏనుమాముల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎన్‌టీఆర్‌నగర్‌లో ఓ బెల్ట్‌షాపులో ఎలాంటి అనుమతి లేకుండా విక్రయిస్తున్న మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు వరంగల్ టాస్క్‌ఫోర్స్ సీఐ అల్లం రాంబాబు ఒక ప్రకటనలో తెలిపారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం

- హోమం పూజలు చేసిన అర్చకులు
- అధిక సంఖ్యలో పాల్గొన్న భక్తులు

నర్సంపేట: పట్టణంలోని శాంతినగర్‌లో రాజశ్యామల ట్రస్ట్ ఆధ్వర్యంలో శ్రీరాజశ్యామల నాగామృత లింగేశ్వరస్వామి శివపంచాయతన ప్రతిష్ఠాపన మహోత్సవం బుధవారం నిర్వహించారు. గత నాలుగు రోజులుగా జరిగిన పూజలో మొదటి రోజు గణపతి పూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, అంకురారోపణ, రెండోరోజు అగ్ని ప్రతిష్ఠాపన, మూల మంత్ర హోమం ప్రతిష్ఠామూర్తులకు పంచామృత అభిషేకాలు, స్థాపిత దేవత హోమాలు చేపట్టారు. మూడో రోజు రాజశ్యామల దేవతా విశేష అర్చన, శ్రీచక్ర మహాపూజ, రాజశ్యామల అమ్మవారి ఫల విశేషాలు అర్చనలు, నాలుగవ రోజు మూలమంత్ర హోమం, రుద్రహోమం, శ్రీరాజమాత నవవర్ణ హోమం, ఆదివాస హోమం, స్థాపిత దేవత హోమాలు, రాజశ్యామల హోమం, మాతంగి హోమం, ఐదో రోజు బుధవారం అశ్విని నక్షత్ర యుక్త మేశ లగ్నంలో లలితా మాత ఆవిర్భవించిన రోజు శ్రీరాజశ్యామల సహిత నాగామృత లింగేశ్వరస్వామి వారి యంత్ర, విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవము వైభవంగా నిర్వహించారు. హోమం కార్యక్రమంలో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా రుత్వికుల వేదమంత్రోచ్ఛరణల మధ్య కార్యక్రమాలు నిర్వహించారు. వెన్నంపల్లి వెంకటసత్యనారాయణశర్మ, నిశాంతిశర్మ అవధాని, నారాయణశర్మ, రాజమండ్రి వాస్తవ్యులు నరేష్‌శర్మ, మల్లికార్జునశర్మ, అయినవోలు కృష్ణమూర్తి, వేద బ్రాహ్మణులు పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో నర్సంపేట మునిసిపాలిటీ ఫ్లోర్ లీడర్ వేముల సాంబయ్యగౌడ్, పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ పాలాయి రవికుమార్, శ్రీరాముల శంకరయ్య, కౌన్సిలర్ నాగిశెట్టి పద్మప్రసాద్, రేమిడి శ్రీనివాస్, వేమిశెట్టి శ్రీనివాస్ దంపతులు, భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



ప్రతిష్ఠాపన పూజలు నిర్వహిస్తున్న అర్చకులు



హోమం పూజలు నిర్వహిస్తున్న అర్చకులు, పాల్గొన్న భక్తులు

కరాటేలో ఆర్డీఎఫ్ విద్యార్థుల ప్రతిభ

పర్వతగిరి: మండలంలోని రోళ్లకల్ ఆర్డీఎఫ్ పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు ఈనెల 11న వైజాగ్‌లో జరిగిన షాటోకాన్ నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్ షిప్–2024లో పాల్గొని మూడు గోల్డ్‌మెడల్, నాలుగు సిల్వర్, ఒక బ్రౌన్జ్ మెడల్ సాధించారని హెచ్‌ఎం బాషబోయిన రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 26న దుబాయిలో జరిగే ఇంటర్నేషనల్ కరాటే చాంపియన్‌షిప్‌కు ఎ.అభినవ్, జె.వివేక్ ఎంపికయ్యారని తెలిపారు. ఈ సందర్భంగా పతకాలు సాధించిన విద్యార్థులను కరాటే పీఈటీ బి.రమేష్, అసిస్టెంట్ హెచ్‌ఎం ఇ.రమేష్, ప్రైమరీ ఇన్‌చార్జ్ జె.బాలరాజ్, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

బాధిత కుటుంబానికి ఆర్థికసాయం



నర్సంపేట: పట్టణంలోని గాంధీనగర్‌లో అనారోగ్యంతో బాధపడుతున్న బాధితురాలికి యువజన సంఘాల బాధ్యుడు ఆబోతు రాజు యాదవ్ ఆధ్వర్యంలో ఆర్థికసాయం అందజేశారు. ఈ మేరకు గాంధీనగర్‌కు చెందిన మహిళ దుర్గాభవాని కిడ్నీ సంబంధిత వ్యాధితో బాధపడుతోంది. విషయం తెలుసుకున్న యువజన సంఘాల జిల్లా అధ్యక్షుడు ఆబోతు రాజుయాదవ్ తనమిత్రుల ద్వారా డబ్బులు సేకరించాడు. సేకరించిన రూ.6500, పదిరోజులకు సరిపడా నిత్యావసర వస్తువులను బాధిత కుటుంబానికి బుధవారం అందజేశారు. కార్యక్రమంలో తిరునగిరి సిద్దార్థ, కొర్ర సారయ్య, కాండూరి నాగరాజు, రుద్ర రాజేష్, పైసా శరత్‌బాబు, శ్రీరామోజు కుమారస్వామి, రాగి నరేష్, పైండ్ల గగన్, పాల్గొన్నారు.

సీఐ, ఎస్సైలను కలిసిన కాంగ్రెస్ నాయకులు



గీసుకొండ: ఇన్‌స్పెక్టర్‌ను కలిసిన ఎంపీపీ సౌజన్య



రాయపర్తి: ఎస్సైని శాలువాతో సత్కరిస్తున్న కాంగ్రెస్ సోషల్ మీడియా బృందం

గీసుకొండ: స్థానిక పోలీస్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్‌గా ఇటీవల బదిలీపై వచ్చిన బాబూలాల్‌ను ఎంపీపీ బీమగాని సౌజన్యతో పాటు పలువురు కాంగ్రెస్ నాయకులు బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. నాయకులు పత్తిపాక రవీందర్, నల్ల సురేశ్‌బాబు, వెంకటేశ్, రాజు, రఘుపతి, గుడిమల్ల భాస్కర్, పెళ్లి రమేశ్, పోటు సుమన్, పవనశ, నాగరాజు, అనిల్ తదితరులు మర్యాదపూర్యకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

రాయపర్తి: మండలానికి నూతనంగా వచ్చి విధుల్లో చేరిన ఎస్సై వడ్డె సందీప్‌కుమార్‌ను కాంగ్రెస్ పార్టీ సోషల్‌మీడియా బృందం బుధవారం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ సందర్భంగా ఎస్సైని శాలువాతో ఘనంగా సత్కరించారు. కలిసిన వారిలో కాంగ్రెస్ మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ బండి రాజేంద్రప్రసాద్, టౌన్ కో–ఆర్డినేటర్ ఉబ్బని నవీన్, అంగిరేకుల మధుకర్, గుగులోతు వెంకన్న, బాదావత్ సురేష్, కందుకూరి రవి, గూడెల్లి యాదగిరి, బెల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఆటో ఢీకొని ఒకరికి గాయాలు

నర్సంపేట రూరల్ : ద్విచక్రవాహనాన్ని ఆటో ఢీకొనడంతో ద్విచక్రవాహనదారుడికి గాయాలైన సంఘటన మండలంలోని రాజుపేట శివారులో బుధవారం చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. నర్సంపేట డివిజన్ సెరికల్చర్ అధికారి సంజీవరెడ్డిని రాజుపేట, ముత్యాలమ్మతండాలకు స్పెషలాఫీసర్‌గా నియమించారు. అయితే తన విధుల్లో భాగంగా నర్సంపేట నుంచి రాజుపేటకు ఉదయం ద్విచక్రవాహనంపై బయలుదేరి వెళ్తున్నారు. ఈక్రమంలో నల్లబెల్లి నుంచి ఆటో ప్రయాణికులతో నర్సంపేట వైపు వస్తుంది. అయితే రాజుపేటకు చేరుకునేసరికి మరో వాహనం రోడ్డుపైకి రావడంతో దానిని తప్పించబోయి సంజీవరెడ్డి ద్విచక్ర వాహనాన్ని ఆటో ఢీకొట్టడంతో తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే నర్సంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషయంగా ఉండడంతో వైద్యులు వరంగల్‌కు రెఫర్ చేశారు.

వైభవంగా బొడ్రాయి ప్రతిష్ఠాపన



బొడ్రాయిని దర్శించుకుంటున్న భక్తులు



కరీమాబాద్‌లో వేడుకల్లో పాల్గొన్న ప్రజలు

ఖిలా వరంగల్: వరంగల్ రంగశాయిపేటలోని సీతారామచంద్ర స్వామి దేవాలయ సమీపంలో, నెహ్రూ సెంటర్ ప్రాంతాల్లో బొడ్రాయి ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని బుధవారం ఉదయం నిర్వహించారు. బొడ్రాయి ఉత్సవ కమిటీ కన్వీనర్ కొల్లూరి యోగానంద్, సమన్వయ కమిటీ కన్వీనర్ గుండు పూర్ణచందర్, ఆర్‌వైఎఫ్ యూత్ ఫోర్స్ సంయుక్త ఆధ్వర్యంలో వేద పండుతులు వెలిదే నరసింహమూర్తి, ప్రభాకర్ శాస్త్రి, భార్గవ శర్మ, ప్రదీప్ శాస్త్రి బృందం నేతృత్వంలో ప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి బొడ్రాయిని దర్శించుకుని పూజలు చేశారు. బుధవారం రాత్రి 10గంటల నుంచి గురువారం తెల్లవారుజాము 3గంటల వరకు అష్ట దిగ్బంధన కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గుండు చందన, మాజీ కార్పొరేటర్ కేడల పద్మ, నాయిని అశోక్, చంద మనోహర్, కొత్త వినయ్, రావుల నరేష్, రాగి శ్రీకాంత్, ఆవునూరి కుమారస్వామి, రావుల సురేష్, సభ్యులు, భక్తులు పాల్గొన్నారు. కాగా, రంగశాయిపేటలోని బొడ్రాయిని నగర మేయర్‌గుండు సుధారాణితో కలిసి తుని ఆశ్రమాధీశ్వరుడు సద్గురు సచ్చిదానంద సరస్వతి మహాస్వామి దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

కరీమాబాద్‌లో..

కరీమాబాద్: కరీమాబాద్‌లో బొడ్రాయి పునఃప్రతిష్ఠాపన మహోత్సవాలు వైభవంగా జరిగాయి. మూడు రోజులుగా నిర్వహిస్తున్న వేడుకల్లో వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య బొడ్రాయి పునఃప్రతిష్ఠాపనను బుధవారం చేపట్టారు.

కోటగుళ్లలో గుప్తనిధుల కోసం తవ్వకాలు

ఆత్మకూరు : మండలంలోని కటాక్షపూర్ సమీపంలోగల కోటగుళ్ల (రామలింగేశ్వర స్వామి ఆలయం)లో గుప్తనిధుల కోసం తవ్వకాలు జరిపిన ఆనవాళ్లు బుధవారం ఆలస్యంగా వెలుగులోకి వచ్చాయి. తెల్లవారుజామున అటు వైపు వెళ్లిన స్థానికులకు తవ్వకాలు జరిపినట్లు ఆనవాళ్లు కనిపించాయి. దీంతో ఎవరు తవ్వకాలు జరిపారో అనే చర్చ గ్రామంలో మొదలైంది. విషయం తెలుసుకున్న స్థానిక పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఈ తవ్వకాలపై దర్యాప్తు చేస్తామని పోలీసులు వెల్లడించారు.



కుప్పగా పోసిన మట్టి



గుప్తనిధుల కోసం తవ్విన ఆనవాళ్లు

బిట్స్‌లో ప్రాంగణ నియామకాలు

నర్సంపేట రూరల్ : మండలంలోని బాలాజీ ఇంజనీరింగ్ కళాశాలలో బుధవారం ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఇన్‌ద్యూర్ అండ్ డిజైన్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో క్వాలిటీ కంట్రోల్ మెకానికల్, సివిల్, ఈఈఈ విద్యార్థులకు ప్రాంగణ నియామకాలు చేపట్టారు. ఈ నియామకాల్లో 150 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా మొదటి రౌండ్‌కు 113 మంది విద్యార్థులు ఎంపిక కాగా చివరి రౌండ్‌లో 28 మంది విద్యార్థులు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన విద్యార్థులు బీటెక్ పూర్తి కాగానే జాబ్‌లోకి తీసుకోవడం జరుగుతుందన్నారు. అనంతరం నియామక పత్రాన్ని అందించారు. కార్యక్రమంలో బాలాజీ విద్యాసంస్థల చైర్మన్ ఎ.రాజేంద్రప్రసాద్ రెడ్డి, సెక్రటరీ రాజేశ్వర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ వీఎస్ హరిహరన్,ముఖ్యప్రాంగణ నియామకపు అధికారి, ఏట సురేష్, ట్రెనింగ్ అండ్ ప్లేస్‌మెంట్స్ హెడ్ షఫీ అహ్మద్ పర్వేజ్, అకడమిక్ కోఆర్డినేటర్ నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వసంత పంచమి వేడుకలు



ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న పండితులు

ఐనవోలు : మండల కేంద్రంలోని శ్రీమల్లికార్జునస్వామి ఆలయంలో గల శ్రీభ్రమరాంభిక అమ్మవారి సన్నధిలో బుధవారం వసంతపంచమి వేడుకలతో పాటు దశమ వార్షికోత్సవాన్ని పండితులు బుధవారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం విఘ్నేశ్వరపూజ, పుణ్యావాచనం, అమ్మవారికి సుగంధ పరిమళ ద్రవ్యాలతో విశేష అభిషేకము, నవకలశస్నపనం, నీరాజన మంత్రపుష్పాన్ని ఆలయ కార్యనిర్వాహణాధికారి అద్దంకి నాగేశ్వర్‌రావు, దేవాలయ ఉపప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకుడు పాతర్లపాటి శ్రీనివాస్, వేదపండితులు గట్టు పురుషోత్తమ శర్మ, విక్రాంత్ వినాయక్‌జోషి, అర్చక సిబ్బంది నిర్వహించారు. దీంతో ఆలయ ప్రాంగణం సందడిగా మారింది. ఈ పూజా కార్యక్రమాల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మేడారం జాతరలో ప్లాస్టిక్ నిషేధం



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న రతన్‌సింగ్‌ఠాకూర్

నడికూడ : మేడారం సమ్మక్క–సారలమ్మ జాతరలో ప్లాస్టిక్ నిషేధమని వినియోగదారుల సమాచార కేంద్రం హనమకొండ జిల్లా అధ్యక్షుడు రతన్‌సింగ్‌ఠాకూర్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన కల్పించి కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడారం జాతరకు వెళ్లే భక్తులు ప్లాస్టిక్ వస్తువులు, కవర్లు, గ్లాసులు వంటి వాటిని తీసుకెళ్లొద్దని సూచించారు. గుడ్డ సంచి లేదా జ్యూట్ సంచులను తీసుకెళ్లాలని అన్నారు. ప్లాస్టిక్ వినియోగం తగ్గిస్తేనే మానవ మనుగడకు మంచిదన్నారు. జాతర పరిసరాలు పరిశుభ్రంగా ఉండే విధంగా ప్రతిఒక్కరూ కృషి చేయాలని అన్నారు. వినియోగదారుల సమాచార కేంద్రం మండల అధ్యక్షుడు మహ్మద్ జమాల్ ఉద్దీన్, వినియోగదారుల సమాచార కేంద్రం జిల్లా సభ్యుడు బండ కాశీదాస్, రామస్వామి, కాంత్రి కుమార్, జగదేవ్, సురేష్, సలీంపాస్పేస్, సారంగపాణి, రాజు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సేవలు గొప్పవి



పారిశుద్ధ్య కార్మికులకును సన్మానిస్తున్న అధికారులు

శాయంపేట : పారిశుద్ధ్య కార్మికుల సేవలు గొప్పవని విద్యుత్‌శాఖ ఏఈ రాజ్‌కుమార్, ఆర్ఐ శరత్‌కుమార్ అన్నారు. పారిశుద్ధ్య పనులు చేస్తున్న కార్మికుల సేవలను గుర్తించి మండల కేంద్రంలోని పంచాయతీ కార్యాలయంలో బుధవారం శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. ఈనెల 7నుంచి 14వ తేదీ వరకు గ్రామాల్లో ప్రత్యేక పారిశుద్ధ్య నిర్వహణకు షెడ్యూల్ విడుదల అయినట్లు తెలిపారు. గ్రామపంచాయతీ స్పెషలాఫీసర్లు మల్టీపర్పస్ సిబ్బందితో శానిటేషన్ పనులు నిర్వహించనట్లు తెలిపారు. ప్రజలు సైతం పరిసరాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా కృషి చేయాలని అన్నారు. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత ముఖ్యమన్నారు. పంచాయతీ కార్యదర్శి మడికొండ రత్నాకర్, మల్టీపర్పస్ సిబ్బంది, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలు

వర్ధన్నపేట: వర్ధన్నపేట, నల్లబెల్లి, చెన్నారావుపేట, పర్వతగిరి, ఖానాపురం, దుగ్గొండి, గీసుకొండ ఎంపీడీఓలు గా వెంకటరమణ నర్సంహమూర్తి, గోవిందరావు, ఎం. శంకర్, ఈగల భారతి, లెక్కల అరుంధతి, వి.కృష్ణవేణిలు బుధవారం ఆయా మండల కేంద్రాల్లోని మండల పరిషత్ కార్యాలయాల్లో బాధ్యతలు చేపట్టారు. ఐనవోలు ఎంపీడీఓగా విధులు నిర్వహిస్తూ బదిలీల్లో భాగంగా వర్ధన్నపేటకు వచ్చారు. బాధ్యతలు స్వీకరించిన ఎంపీడీఓలను ఎంపీడీఓ కార్యాలయం సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు తదితరులు మర్యాదరపూర్వకంగా శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఎంపీడీ ఓలు మాట్లాడుతూ ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా గ్రామాల అభివృద్ధి కోసం పాటుపడుతామని చెప్పారు. మండల పరిధిలోని అన్ని గ్రామాలను పక్షపాతం లేకుండా సమగ్రంగా అభివృద్ధి చేస్తామన్నారు. మండల అభివృద్ధి కోసం ప్రతి ఒక్కరూ కలిసి రావాలని వారు సూచించారు. ఉద్యోగులకు బదిలీలు సహజమని అన్నారు.

16న దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలి

- ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు చెన్నకేశవులు

నెక్కొండ: కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈ నెల 16న తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు కందిక చెన్నకేశవులు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో బుధవారం దేశవ్యాప్త సమ్మె వాల్ పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. కేంద్రం రైతాంగాన్ని విస్మరిస్తూ కార్పొరేట్ శక్తులకు ఎర్ర తివాచీ పరుస్తోందని ఆరోపించారు. సమ్మెలో అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో కార్మికులు రామారపు శ్రీమన్నారాయణ, తాటికాయల యాకయ్య, ఈదునూరి నవీన్, రాజు, అనిల్, యాట యాక య్య, సురేష్ పాల్గొన్నారు.



నెక్కొండ : వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న చెన్నకేశవులు, కార్మికులు

నర్సంపేట: దేశవ్యాప్తంగా ఈనెల 16న చేపట్టిన సమ్మెను జయప్రదం చేయాలని కార్మిక సంఘాల నాయకులు గోనె యువరాజు, అనంతగిరి రవి, గుంపెల్లి మునీశ్వర్ కోరారు. ఈ మేరకు బీఆర్‌టీయూ, సీఐటీయూ, ఏఐటీయూసీ, ఏఐఎఫ్‌టీయూ(న్యూ) సంఘాల ఆధ్వర్యంలో బుధవారం నర్సంపేట వ్యవసాయ గ్రీన్ మార్కెట్ కార్యదర్శి, రైస్ మిల్లర్స్ అసోసియేషన్, కిరాణా వర్తక సంఘం, ఐరన్‌అండ్ హార్డ్‌వేర్, ఫర్టిలైజర్, తదితర యాజమాన్యాలకు సమ్మె నోటీసు ఇచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యుడు కందికొండ రాజు, నాగులు, జనార్దన్, సురేష్, తదితరులు పాల్గొన్నారు.

గీసుకొండ: కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్, మతతత్వ, కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 16న దేశవ్యాప్తంగా చేపట్టిన కార్మిక సమ్మె, గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని పలు వామపక్ష పార్టీల నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మండల కేంద్రంలో జాయింట్ ప్లాట్‌ఫామ్ ఆఫ్ ట్రేడ్ యూనియన్, సంయుక్త కిసాన్ మోర్చా, ఎస్‌కేఎం రైతు వ్యవసాయ కార్మిక సంఘాల ఐక్యవేదిక నాయకులు సమావేశమై బంద్‌ను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు చుక్క మొగిలి, కంది కుమారస్వామి, చల్లా నర్సిరెడ్డి, శంకరయ్య, బ్రహ్మచారి తదితరులు పాల్గొన్నారు.

పర్వతగిరి: ఈనెల 16న జరిగే గ్రామీణ భారత్ బంద్‌ను విజయవంతం చేయాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎండీ.ఇస్మాయిల్ పిలుపునిచ్చారు. మండలంలోని కొంకపాక శివారు కేఎస్‌ఆర్ రైస్ మిల్లు హమాలీ కార్మికులతో బుధవారం రైతు సంఘం, కార్మిక సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాలు సమావేశం నిర్వహించారు. హమాలీ సంఘం నాయకులు వీరన్న, శంకరన్న, లాలు, చేరాలు, ఈరమల్లు, మల్లయ్య, ఐలన్న, ఉప్పలన్న పాల్గొన్నారు.



నర్సంపేట: యాజమాన్యాలకు సమ్మె నోటీసు అందజేస్తున్న కార్మిక సంఘాలు



గీసుకొండ : మాట్లాడుతున్న నాయకుడు శంకరయ్య



పర్వతగిరి : సమావేశంలో మాట్లాడుతున్న ఇస్మాయిల్

అమరవీరులకు ఘననివాళి



పరకాల : 2019 ఫిబ్రవరి 14వ తేదీన పుల్వామలో ఉగ్రవాదులు జరిపిన దాడిలో అమరులైన 40 మంది భారత సైనికులను స్మరించుకుంటూ యాక్ ఆధ్వర్యంలో పట్టణంలో బుధవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ సెంటర్ నుంచి పోచమ్మగుడి వరకు ర్యాలీ నిర్వహించిన యువకులు.. భారత అమర వీరులారా జోహర్లు అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా యాక్ రీజినల్ కన్వీనర్ సూర రాజేందర్ మాట్లాడుతూ.. అమరులైన భారత సైనికుల ఆశయ సాధనకు కృషి చేస్తామని అన్నారు.